క్లుప్తంగా

యల్లనూరు తహసీల్దార్‌గా సుమతి



యల్లనూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా సుమతి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈమె పుట్లూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు పామిడిలో రైతు భరోసా సంబరాలు

పామిడి: మండల కేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతుభరోసా సంబరాలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఐదో విడత రైతుభరోసా విడుదలను పురస్కరించుకొని వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. మండల ప్రజాప్రతినిధులు, పట్టణ, రూరల్ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ వెంకటరత్నం

యల్లనూరు: ఉపాధి పనులను నాణ్యతగా చేయాలని డ్వామా ఏపీడీ వెంకటరత్నం కూలీలకు సూచించారు. శుక్రవారం కాచర్లకుంటలో పూడికతీత పనులు, జంగంపల్లిల్లో పశువుల నీటికుంట, యల్లనూరులో అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువు పూడిక తీత పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టీఏ ప్రతాప్, క్షేత్రసహాయకులు హనుమంతు, దివాకర్‌నాయుడు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు సమీపంలో శుక్రవారం ఒరిస్సా యువకుడు రైలు నుంచి జారి పడటంతో గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. ఒడిషాకు చెందిన సంతోష్‌కుమార్ నాయక్ అనే యువకుడు ప్రమాద వశాత్తు రైలు నుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అమ్మవారిని తాకిన సూర్య కిరణాలు



సూర్య కిరణాల వెలుగులో అమ్మవారు

పామిడి: స్థానిక దత్త మహాయోగ పీఠంలో శుక్రవారం హింగుళికాంబ అమ్మవారిని సూర్య కిరణాలు తాకాయి. దీంతో ఆలయ పీఠాధిపతి సురేంద్ర మహరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నెట్టికంటుడి సన్నిధిలో చీరాల ఎమ్మెల్సీ



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

గుంతకల్లు రూరల్: ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీమహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు తీర్థప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు.

మున్సిపల్ ఏసీపీ ఇషాక్ బదిలీ

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న కెఎండీ.ఇషాక్ అనంతపురము-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా)అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ డీటీసీపీ ఉత్తర్వులు జారీ చేశారు. గుత్తి మున్సిపాల్టీలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న అబ్దుల్‌సత్తార్‌ను గుంతకల్లు మున్సిపాల్టీకి బదిలీ చేశారు.

రైతుల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పైలా తదితరులు



శింగనమలలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గుత్తి: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్య యాదవ్, ప్రస్తుత చైర్మన్ సునీలా యాదవ్ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టాక ఇంత వరకు ఐదు సార్లు రైతు భరోసా కింద రైతులందరికీ పెట్టుబడి సాయం కింద నగదు బ్యాంకుల్లో జమ చేశారన్నారు. రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయడానికి, రైతులకు అన్ని రకాల విత్తనాలు ఇవ్వడానికి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. పంట నష్టపోయిన వెంటనే నష్ట పరిహారం ఇవ్వడం, పంటల బీమాతోపాటు సున్నా వడ్డీకే పంట రుణాలు ఇస్తున్నారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో రైతుల కోసం మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశ పెడతారన్నాన్నారు. 2024లో కూడా సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వీరన్న, మదన్, ప్రతాప్, ఓబుళయ్య, అనగానదొడ్డి రాజు, హసేని, లాలూ నాయక్, పి. శ్రీనివాసులు, శ్రీరాములు, హనుమంతు, సంజీవులు, నూర్ నాయక్, లక్ష్మినారాయణ, లాలెప్ప, లక్ష్మిరెడ్డి, బాషా, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు జగనన్న

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు బాంధవుడని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్వీ నారాయణ, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేయడంతో శుక్రవారం శింగనమలలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అందిస్తున్నారన్నారు. రైతులకు ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా ఏటా అందిస్తున్నారని, ఈఏడాది మొదటి విడుత అందించారన్నారు. రబీలో పంట నష్టం జరిగితే ఖరీఫ్ వచ్చేటప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అకాల వర్షాలకు పంటలు దెబ్బతింటే చంద్రబాబు ఎలాంటి పరిహారం అందించలేకపోయారన్నారు. రైతుల కోసం సీఎం జగనన్న ఆర్బీకేలను ఏర్పాటు చేసి, అక్కడే ఎరువులు, విత్తనాలు, మందులు అందిస్తున్నారన్నారు. రైతులకు వ్యవసాయాంత్రీకరణ పనిముట్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందిస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి నెరవేర్చలేక పోయారన్నారు. కనీసం వాటిని వెబ్‌సైట్‌లో నుంచి తీసి వేసుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల కోసం బూటకపు మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. తప్పుడు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి రావాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నకేశవులు, ఎస్వీ నారాయణరెడ్డి, నవీన్‌కుమార్, శివశంకర్‌రెడ్డి, కోరే రాముడు, చక్రపాణిరెడ్డి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

యల్లనూరు: ఫ్యాక్షన్ గ్రామాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తాడిపత్రి సబ్ డివిజన్ నుంచి యల్లనూరు, పుట్లూరు మండలాలు అనంతపురం సబ్ డివిజన్ లోకి కలిపారన్నారు. గ్రామాల్లో ఫ్యాక్షన్ పేరు ఎక్కడా వినిపించకూడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. మట్కా, పేకాట వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చిన్నపాటి సమస్యలు ఉంటే రాజకీయ రంగు పూసి పెద్దవి చేస్తే ఊరుకోవద్దని అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు సీఐ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ శివ, వెంకటరాముడు, పోలీసు కానిస్టేబుల్ వీర, శివారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పారిశుధ్య కార్మికుల కృతజ్ఞతలు



వైఎస్సార్‌సీపీ నాయకులకు మిఠాయిలు తినిపిస్తున్న పారిశుధ్య కార్మికులు

తాడిపత్రి టౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రత్యేక చొరవతో పెంచిన జీతాలు ప్రతి నెలా ఇవ్వడం హర్షణీయమని గన్నేవారిపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. స్థానిక గన్నేవారిపల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పంచాయతీ పారిశుధ్య కార్మికులు అభినంద సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చాలీచాలనీ జీతాలతో కుటుంబం గడవక ఇబ్బందులు పడ్డామన్నారు. అనారోగ్యంతో విధులకు హాజరుకాకపోతే జీతంలో కోత విధించేవారన్నారు. ప్రస్తుతం జీతాలు పెంచడంతోపాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీటీసీ రవికుమార్, ప్రదీప్‌రెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వలంటీరుకు హర్ష పరామర్శ



వలంటీరును పరామర్శిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: పుప్పాల గ్రామానికి చెందిన వలంటీరు హర్షను శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. గత నెల 19న పుప్పాల గ్రామానికి చెందిన వలంటీరు హర్షను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గంగిరెడ్డి, ప్రభాకర్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స తర్వాత శుక్రవారం వలంటీర్ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈసందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి వలంటీరుతో దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. వలంటీరు బాగా పని చేస్తున్నాడనే అక్కసుతో టీడీపీ సర్పంచు దేవేంద్ర అనుచరులు కత్తులు, కట్టెలతో దాడి చేశారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి వివరించారు. ఇక నుంచి కేతిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందని హర్షవర్ధన్‌రెడ్డి భరోసా కల్పించారు. అనంతరం వైద్య ఖర్చుల కోసం రూ.40 వేలు నగదు అందించారు. నాయకులు దేవేంద్ర, లక్ష్మిరంగారెడ్డి, ప్రసాద్, రాజు, సుదర్శన్, త్రినాథ్, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపీడీఓ విజయ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్న జగనన్న లేఅవుట్-1,2లో పర్యటించారు. ముందుగా గ్రామంలో ఎన్ని లే అవుట్లు ఉన్నాయి, ఎంత మందికి ఇళ్ల పట్టాలు, గృహాలు మంజూరయ్యాయని సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీలో త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పునాదులు ఉన్న ఇళ్లను త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేలా చర్యలు చేపడుతామన్నారు. ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. హౌసింగ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి



ఆర్‌డీఓ రవీంద్రకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 23 నుంచి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని ఆందోళనలు చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవ రోజు మహా పంచాయత్ పేరుతో శాంతియుతంగా ఆందోళనకు సిద్ధమైన మహిళ రెజ్లర్లపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారన్నారు. ఆర్‌డీఓ రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి చిన్నా, నాయకులు బి.హనుమంతు, దేవేంద్ర, బాషా, జిలాన్, ఆశాబేగం తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌పీఎస్ నాయకులు

గుత్తి రూరల్: మండలానికి ప్రభుత్వం కేటాయించిన ఆరు డిజిటల్ లైబ్రరీలను వెంటనే ప్రారంభించాలని రాయలసీమ విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఎంపీడీఓ చిట్రా శ్రీనివాసులుకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ లైబ్రరీలు యువతీ, యువకులు, విద్యార్థులు, ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఇంటర్‌నెట్ సదుపాయంతో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎస్ నాయకులు కాశీరావు, గురుశంకర్, కోటీశ్వరరావు, జ్ఞానేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవం



పామిడిలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలో శుక్రవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పాతబస్టాండ్ సర్కిల్ వద్దనున్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. శివాజీ అమర్‌రహే అంటూ నినాదాలతో హోరెత్తించారు. అంతకుముందు పురవీధుల్లో ఛత్రపత్రి శివాజీ మహరాజ్‌కు జై అంటూ బైకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో భావసార క్షత్రియులు జోజోడే కుమార్, యామంజునాథ్‌రావు, శ్రీనివాసరావు, భవాని, శ్రీధర్, ఆర్ఎస్ఎస్ సుధాకర్, బాలనాగరాజు, రత్నమయ్య, చౌడయ్య, గడియారం శీనా తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు


గుత్తి: తనను ముగ్గురు వ్యక్తులు లైంగికంగా వేధిస్తున్నారని ఓ యువతి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఓ యువతి గుత్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పని చేస్తోంది. ఇదే ఆసుపత్రిలో ఓటీ అసిస్టెంట్‌గా పని చేసే నబీరసూల్, ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేసే రాజశేఖర్‌తో పాటు మరో వ్యక్తి సదరు యువతిని గత మూడు మాసాలుగా లైంగికంగా వేధిస్తుండటంతో పాటు అసభ్యంగా, అవమానకరంగా మాట్లాడుతున్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఘర్షణలో మహిళకు తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు: మిడుతూరు గ్రామంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. నెల రోజుల క్రితం ఆర్‌డీటీ స్కూల్ వద్ద గొల్ల ధనశేఖర్ కుటుంబ సభ్యులు వేరుశనగ కాయలు విత్తనానికి వలుస్తుండగా బోయ నాగరాజు ఘర్షణ పడ్డాడు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య వివాదం ఏర్పడింది. శుక్రవారం బోయ నాగరాజు తన భార్య వరలక్ష్మితో కలిసి వెళ్తుండగా ఒక్కసారి గొల్ల ధనశేఖర్ కుటుంబ సభ్యులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వరలక్ష్మిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని దాడి ఘటనపై విచారణ చేపట్టారు. ఘటనపై ఇప్పటి వరకూ ఫిర్యాదు అందలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

సంపు వద్ద పరిశుభ్రంగా ఉంచండి

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ క్లియర్ వాటర్ సంపుల చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న వాటర్‌వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయన పాత సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ క్లియర్ వాటర్ సంపు, ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. నీటి పంపింగ్ మోటార్ మరమ్మతులేవైనా ఉంటే సకాలంలో చేయించాలన్నారు. మున్సిపల్ ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్లియర్ వాటర్ సంప్ పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

కాలేయ వ్యాధి బాధితుడికి రూ.10 లక్షల సాయం



చెక్కు అందిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పట్టణానికి చెందిన కాలేయ వ్యాధి బాధితుడు రంగనాథరెడ్డికి రూ.10 లక్షల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. పట్టణానికి చెందిన రంగనాథరెడ్డి కొంత కాలంలో లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య కోసం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం ఇప్పించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీఎం సహాయనిధి కింద ఆర్థికసాయం మంజూరు చేయించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డికి రంగనాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

శానిటేషన్ జాబ్‌చార్ట్ అమలు చేయాలని వినతి

తాడిపత్రి టౌన్: శానిటేషన్ జాబ్‌చార్ట్ అమలు చేయాలని శానిటేషన్ కార్యదర్శులు మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్యను కోరారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం శానిటేషన్ కార్యదర్శులు మాట్లాడుతూ ఉదయం శానిటేషన్ విధుల్లో పాల్గొని మళ్లీ సచివాలయ వేళల్లో హాజరు కావాల్సి వస్తుండంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందరూ సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ శానిటేషన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర, శానిటేషన్ కార్యదర్శులు మమత, శిరీష, ఆంజి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దవడుగూరు: విరూపాపురంలోల ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన నరేంద్ర(29) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం అయినా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నరేంద్ర సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఊరు చివరలో ఉన్న చింతచెట్టు దగ్గరకు వెళ్లారు. అక్కడ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



మోహన్‌కుమార్



రమాదేవి

పుట్లూరు: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్‌గా మోహన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పుట్లూరు తహసీల్దార్ సుమతి యల్లనూరుకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో మోహన్‌కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో చేపడుతున్న రీ సర్వే, హౌసింగ్‌పై సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్‌గా రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఈమె యల్లనూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న మోహన్‌కుమార్ పుట్లూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ సునీత, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సర్పంచ్ పార్వతి, ఎస్సీసెల్ నాయకుడు కాటమయ్య తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

5న మెగా కంటి వైద్యశిబిరం

గార్లదిన్నె: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 5న శాంతిరాం మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వ హించనున్నట్లు అనంతపురము మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కంటి శిబిరంలో చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకు కంటి పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆవు మృతి



మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న గోపాలమిత్ర ఆదిశేషయ్య

యాడికి: రాయలచెరువులో ఉరుములు, మెరుపులతో భయానికి గురై ఓ ఆవు మృతి చెందింది. గోపాలమిత్ర ఆదిశేషయ్య వివరాల మేరకు.. గ్రామంలో ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కురుబ దస్తగిరి తన ఇంటి సమీపంలో ఉన్న పశువుల పాకలో ఎద్దులు, ఎనుములు, కట్టేశాడు. గురువారం రాత్రి పిడుగు పడే శబ్దాలు రావటంతో భయానికి గురైన ఆవు మృతి చెందింది. గోపాల మిత్ర ఆదిశేషయ్య శుక్రవారం దస్తగిరి ఇంటి వద్దకు వెళ్లి మృతి చెందిన ఆవును పరిశీలించి పశు వైద్యాధికారి సుబ్బారెడ్డి సమాచారం అందించారు.

బంగారు గొలుసు చోరీ

తాడిపత్రి అర్బన్: నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలో నుండి బంగారు గొలుసు చోరీ చేసినట ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు,, పట్టణంలోని మార్కండేయస్వామి ఎదురుగా నరసింహులు అనే వ్యక్తి సిల్క్ హౌస్‌ను నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి నరసింహులు భార్య దేవి తన షాపు నుంచి ఇంటికి వెళుతుండగా రెడ్డివారిపాలెంలోకి రాగానే వెనుకవైపు నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని యువకుడు దేవి మెడలో నుండి 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దపప్పూరు: చిక్కేపల్లి గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ కలహాలతో విష గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని 108లో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846